నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

జైనథ్ : డొల్లార వద్ద పెన్‌గంగా ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఉట్నూర్ ఐబీ ప్రాంతంలో దుకాణంలోకి చేరిన వర్షం నీరు

ఇంద్రవెల్లి : కొతకు గురైన పాటగూడ బ్రిడ్జి

బాసర : గోదావరి ఉధృతి

కుంటాల : వెంకూర్‌లో పత్తి చేనులో నిలిచిన నీరు

జైనథ్ : ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నది

ముంచెత్తిన వాన

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షం

- ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా.. నీట మునిగిన పొలాలు..
- కోతకు గురైన రోడ్లు.. రాకపోకలకు తీవ్ర అంతరాయం
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. పల్లు ఇండ్లు ధ్వంసం
- భైంసా మండలంలో కరెంటు షాక్‌తో ఒకరి మృతి
- పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్లు, ఎస్పీలు

ఆదిలాబాద్/నిర్మల్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాను రెండో రోజులుగా వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉట్నూర్‌లో అత్యధికంగా 16.7 సెంటీమీటర్ల వర్షం పడింది. ఇంద్రవెల్లి మండలంలో 14.6, సిరికొండలో 12, నార్నూర్, గాదిగూడ మండలాల్లో 8.6, నేరడిగొండలో 4.2, గుడిహత్నూర్‌లో 4.1, బేలలో 3.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లోని పలు గ్రామాల రహదారులు కోతకు గురయ్యాయి. చెరువులు మత్తడి దుంకి ప్రవహిస్తున్నాయి. ఉట్నూర్‌లో చెరువు పొంగి ప్రవహించడంతో బస్టాండ్, ఐబీ ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచింది. ఇంద్రవెల్లి మండలంలోని పాటగూడ, కల్వపేట్, అంజీ, మర్కగూడ గ్రామాలక వెళ్లే రహదారి కోతకు గురైంది. ఉట్నూర్ మండలంలోని కామాయి పేట రోడ్డు కోతకు గురైంది.

భారీగా పంట నష్టం

వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లింది. వాగులు పొంగి ప్రవహించడంతోపాటు చెరువులు మత్తడి దుంకడంతో చేలలోకి నీరు చేరింది. ఇసుక మేటలు వేయడంతో నష్టం సంభవించింది. పత్తి, సోయాబిన్, కంది, వరి పంటలను నష్టం వాటిల్లింది. పెన్‌గంగా నదీ ప్రవాహం కారణంగా పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగాయి. వ్యవసాయ అధికారులు నష్టం వివరాలను సేకరిస్తున్నారు. జైనథ్ మండలం వద్ద గల మహారాష్ట్ర సరిహద్దు డొల్లార వద్ద పెన్‌గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నది. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంలు పెన్‌గంగా ప్రవాహాన్ని పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిర్మల్ జిల్లాలో సగటు 86 మిల్లీమీటర్ల వర్షపాతం

నిర్మల్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుంటాల మండలంలో పలు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఓలా నుంచి లింబా(బి) గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిర్మల్ శివారులోని సిద్ధాపూర్ వద్ద స్వర్ణ వాగు పొంగి ప్రవహిస్తుండడంతో కౌట్ట, సిద్ధులకుంట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్‌లోని జీఎన్ఆర్ కాలనీవాసులకు స్వర్ణ వాగు నుంచి ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో కాలనీలోని 40 కుటుంబాలకు ముందు జాగ్రత్తగా ఓ ప్రైవేటు పాఠశాలలో పునరావాసాన్ని కల్పించారు. భారీ వర్షాల కారణంగా భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో కరెంటు షాక్‌కు గురై కదం భోజరాం(28) మృత్యువాత పడ్డాడు. ఆదివారం రాత్రి కురిసిన అతి భారీ వర్షం వల్ల ఇంటి పైకప్పు(రేకుల) నుంచి వర్షపు నీరు లీకవుతుండడంతో రేకులపైన పారీ కప్పడానికి భోజరాం పైకి ఎక్కాడు. అప్పటికే అక్కడక్కడ తెగిపోయిన సర్వీస్ వైరు రేకులను ఆనుకుని ఉన్నది. ఇది గమనించక రేకులను తాకడంతో ఒక్కసారి భారీ శబ్దం వచ్చింది. కుటుంబ సభ్యులు, స్థానికులు వచ్చి చూడగా కరెంటు షాక్‌కు గురై భోజారాం మృతిచెందినట్లు గుర్తించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి బాసర గోదావరి నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది.

ప్రాజెక్టులకు భారీ వరద

కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా 690 అడుగుల వద్ద నీటిని స్థిరంగా ఉంచుతూ నాలుగు గేట్ల ద్వారా 14 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 22 వేల క్యూసెక్కులుగా ఉంది. స్వర్ణ ప్రాజెక్టుకు 3,190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి 5,320 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1183 అడుగులు కాగా, ప్రస్తుతం 1179.6 అడుగుల మట్టానికి నీరు చేరుకుంది. గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు 13 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండడంతో మూడు గేట్లను ఎత్తి 12,579 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358 అడుగులు కాగా ప్రస్తుతం 357 అడుగులకు నీరు చేరిం ది. ఎవరైనా వరదల్లో చిక్కుకుంటే అత్యవసర సమయంలో 6305646600 నంబరుకు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని చాలా చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతున్నాయి.

పెంబి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు

24గంటల వ్యవధిలో జిల్లా సగటు వర్షపాతం 86 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా పెంబి మండలంలో 145.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే కుభీర్‌లో 63.3, తానూర్‌లో 39.4, బాసరలో42.2, ముథోల్‌లో 54.2, భైంసాలో 50.1, కుంటాలలో 47.4, లోకేశ్వరంలో 58.8, నర్సాపూర్ (జి)లో 41.9, దిలావర్‌పూర్‌లో 92.7, సారంగాపూర్‌లో 70.8, నిర్మల్‌లో 118.8, నిర్మల్ రూరల్ మండలంలో 123.6, సోన్‌లో 120.6, లక్ష్మణచాందలో 134.5, మామడలో 117.2, ఖానాపూర్‌లో 122.8, కడెంలో 121.8, దస్తురాబాద్‌లో 68.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉప్పొంగి ప్రవహిస్తున్న స్వర్ణ వాగు

కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద నీరు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

- ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- మంత్రి శ్రీధర్‌బాబు

కడెం, సెప్టెంబర్ 2 : నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు వరద ప్రవాహం క్రమంగా పెరుగున్న నేపథ్యంలో నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం రాత్రి మంత్రి కడెం ప్రాజెక్టును సందర్శించి వరదగేట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో, విడుదల చేస్తున్న నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీటిని అధికారులు పర్యవేక్షణ చేపడుతూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల ఉన్నారు.

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి నిరసన సెగ

- ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రిలో చేరిన యువకుడు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 2 : నిర్మల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. సోమవారం నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీలో పర్యటించేందుకు వెళ్లిన మహేశ్వర్‌రెడ్డిని చూసి హరీశ్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గత ఎమ్మెల్యేగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి జీఎన్ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని విన్నవించినా పరిష్కరించలేదు. మహేశ్వర్‌రెడ్డి అయినా గెలిస్తే సమస్యలు తీరుతాయని అనుకున్నాడు. కానీ.. ఆయనపై కూడా నమ్మకం పోయిందని యువకుడు తెలిపాడు. ప్రాణం పోతేనైనా మా కాలనీ సమస్య తీరుతుందని అనుకుంటే నా ప్రాణం తీసుకునేందుకైనా సిద్ధంగా ఉన్నానని బిల్డింగ్‌పై నుంచి దూకానని, దీంతోనైనా 40 కుటుంబాలు బాగు పడుతాయని అనుకున్నానని తెలిపారు. బిల్డింగ్ పై న ఉంచి దూకడంతో కాలు విరిగిందని తెలిపాడు. ప్రాణం పోతేనే సమస్య తీరుతుందని అనుకుంటే మరోసారి కూడా దూకడానికి సిద్ధమేనని అన్నాడు. మహేశ్వర్‌రెడ్డి అంటే అభిమానమని, ఆయన గెలుపునకు కృషి చేశానని చెప్పాడు. ఏదో చేస్తారని ఓటు వేశామని, ఏం చేయకపోతే ఎలా అని ప్రశ్నించాడు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హరీశ్

కిరాయి ఇంట్లో ఉంటున్నాం..

రెండు రోజుల నుంచి కురుస్తున్న వానలకు మా పెంకుటిల్లు పైకప్పు, గోడ కూలింది. ఈ ఇంట్లో ఉండలేని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు కుటుంబంతో బయట కిరాయి ఇంట్లో ఉంటున్నాం. అధికారులు వచ్చి రాసుకుని పోయిండ్రు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- మందుల అమ్మాయి, లింబా(బీ), కుంటాల మండలం.

యేటా నష్టమే..

వెంకూర్ చెరువు కింద మా భూములు ఉన్నాయి. చెరువు అలుగు రిపేర్ చేయకపోవడంతో యేటా చెరువు నుంచి వర్షపు నీరు వాగులోకి వస్తున్నాయి. ఈ వరద నీరు మా పత్తి, సోయా పంటలను నాశనం చేస్తున్నాయి. పొలాల్లో ఇసుక మేటలు పెడుతున్నాయి. నష్టపరిహారాన్ని అందించి సర్కారు ఆదుకోవాలి.

- మనోహర్, రైతు, వెంకూర్, కుంటాల మండలం.

కడెం గేట్ల ఎత్తివేత

కడెం, సెప్టెంబర్ 2 : నాలుగు రోజుల నుంచి ఎగువ ప్రాంతాల నుంచి అత్యధికంగా ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు మూడు రోజులుగా కడెం వరదగేట్లను ఎత్తి నీటిని దిగువనకు వదులుతున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 694.300 అడుగులు (6.198 టీఎంసీల) వద్ద ఉంది. సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి అత్యధికంగా 1,94,039 క్యూసెక్కుల నీరు రావడంతో 18 గేట్లను ఎత్తి దిగువ గోదావరిలోకి 2,48,378 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఇదే అత్యధిక ఇన్‌ఫ్లో రావడంతో పూర్తి స్థాయి గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి : కలెక్టర్

కడెం ప్రాజెక్టు పరిసర ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గెట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రైతులు, పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్పా ప్రజలేవ్వరు ఇంటి నుంచి బయటకు రావోద్దని, వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మీ, డీఎస్పీ గంగారెడ్డి, ఈఈ విఠల్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.

ఈఈ విఠల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

భైంసా టౌన్, సెప్టెంబర్ 2 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కదం భోజారం(28) ఆదివారం రాత్రి 9.10 సమయానికి విద్యుత్ షాక్‌కు గుపై మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. భోజారాం సిమెంట్ గోడలపై రేకులు వేసుకుని తల్లి అంసాబాయితో ఉంటున్నాడు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పు(రేకుల) నుంచి వర్షపు నీరు లీకేజీ అవడంతో రేకుల పైన పారి(పంటలను ఆరబెట్టడానికి, కప్పడానికి ఉపయోగించే కవర్) కప్పడానికి పైకి ఎక్కాడు. ఇంటికి విద్యుత్ సరఫరా చేస్తున్న సర్వీస్ వైరు రేకులను ఆనుకుని ఉంది. వైరు అక్కడక్కడ డ్యామేజ్ అయి ఉండడంతో రేకులకు విద్యుత్ సరఫరా జరిగింది. భోజరాం రేకుల పైకి ఎక్కగానే పెద్ద శబ్దం రావడంతో తల్లి బయటకు వచ్చి కేకలు వేయగా కొడుకు స్పందించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె మరింత గట్టిగా కేకలు వేయగా చుట్టు పక్కల వాళ్లు వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. రేకుల పైకి వెళ్లి గమనించగా భోజారాం విగత జీవిగా పడి ఉన్నాడు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తల్లి అంసాబాయి రూరల్ ఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కదం భోజారాం(ఫైల్)

ఘనంగా పొలాల అమావాస్య

జైనథ్, సెప్టెంబర్ 2 : మండల కేంద్రమైన జైనథ్‌లో పొలాల అమావాస్య పండగను రైతులు, ప్రజలు, మహిళలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బసవన్నలను చెరువులు, వాగుల్లో శుభ్రం చేసి పూలు, కుషాటలు, మొర్కలు, జూళ్లతో అలంకరించారు. డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసవన్నలకు నైవేధ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అడ గ్రామంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, దీపాయిగూడలో మాజీ మంత్రి జోగు రామన్న, కూర గ్రామంలో మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్, ఆనంద్‌పూర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి పొలాల పండగ వేడుకల్లో పాల్గొన్నారు.

దీపాయిగూడలో బసవన్నలకు నైవేధ్యం పెడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు

అధైర్య పడకండి.. నేనున్నా..

- సహాయ పనుల్లో బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్
- ఎక్స్‌లో అభినందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఎక్స్‌లో అభినందించిన కేటీఆర్

ఇచ్చోడ మండలంలో సహాయక చర్యల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ) : ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుగా నిలుస్తున్న బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సోమవారం ఇచ్చోడలో వర్షం సాయ పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. వర్షం కారణంగా ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రధాన రహదారులతోపాటు పలు కాలనీలు జలమయ్యాయి. సోమవారం అంగడికావడంతో ప్రజలు, దుకాణాదారులు ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సహాయక చర్యలు చేపట్టారు. వర్షంతో తడుస్తూ జేసీబీలతో కాలనీల్లో నిలిచిన నీటిని తొలగించారు. పలు రోడ్లకు మరమ్మతులు చేయించారు. రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉండడంతో వాటి ని తొలిగించి వేరే చోటికి ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ స్థానికులకు చేసిన సాయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో అభినందించారు.

సర్కారు సర్వే నిర్వహించాలి

జైనథ్, సెప్టెంబర్ 2 : ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద విపత్తుపై సర్కారు వెంటనే సర్వే చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పెన్‌గంగా ముంపు గ్రామాలైన ఆనంద్‌పూర్, కూర గ్రామాలతోపాటు బేల మండలంలోని పెన్‌గంగా వరదముంపు గ్రామాలను అధికారులు, నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఇలాంటి వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం జరగాలంటే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్‌గంగా పరీవాహక గ్రామాల్లో రైతులు వేసిన వివిధ పంటలకు వేల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని వాపోయారు. నష్టపోయిన పంటలకు ఎకరకు రూ.40 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కిసాన్ మోర్చ అధ్యక్షుడు దయాకర్, మండలాధ్యక్షుడు ఏనుగు రాకేశ్‌రెడ్డి, నాయకులు, ముకుంద్‌రావ్, భూమన్న, ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డి, విజయ్, విశాల్, డికేందర్ ఉన్నారు.

కూరలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

హనుమాన్ ఆలయంపై పిడుగు


పిడుగు పడడంతో దెబ్బతిన్న గోపురం

బేల, సెప్టెంబర్ 2 : బోనాల జీపీలోని దేవిగూడలో ఆదివారం రాత్రి హనుమాన్ ఆలయం పై పిడుగు పడి ఆలయం పైకప్పు కూలింది. పక్కనే ఉన్న ఇండ్లలో యువకుడు ఫోన్ చార్జింగ్ పెట్టి ఉండడం వల్ల ఆ పిడుగుపాటు ప్రభావంతో ఫోన్ పగిలి పెద్ద ప్ర మాదం తప్పింది. దీంతో గ్రామస్తులు భయాందోళన గురయ్యారు. పిడుగుపాటు ప్రభావంతో గ్రా మంలో నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.